ఆణిముత్యాల తెలుగు పద్యాల సంకలనం

# వర్ణన రత్నాకరము

పాఠకమిత్ర వ్యాఖ్య – ఇరవయ్యవ సంపుటం


సంకలనకర్త

**దాసరి లక్ష్మణస్వామి**

వ్యాఖ్యాత

**అద్దంకి శ్రీనివాస్**



ప్రచురణ

ప్రాచీన తెలుగు - అధ్యయనకేంద్రం

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్

&

ఎమెస్కో హైదరాబాద్

# వర్ణన రత్నాకరము

## పాఠకమిత్ర వ్యాఖ్య – ఇరవయ్యవ సంపుటం

## విషయసూచిక


| | అంశం | పద్యసంఖ్య | పుట | వ్యాఖ్యాత |
|---|---|---|---|---|
| | సంపాదకీయం | | 7–8 | |
| 1. | చమత్కార చాటు పద్యములు | 1 – 171 | 9–121 | అద్దంకి శ్రీనివాస్ |
| 2. | సమస్యలు | 172–230 | 122–158 | " |
| 3. | వ్యవహారపద్ధతి | 231–271 | 159–182 | " |
| 4. | ప్రహ్లాదచరిత్ర | 272–286 | 183–196 | " |
| 5. | గజేంద్రమోక్షము | 287–311 | 197–214 | " |
| 6. | వామన చరిత్రము | 312–344 | 215–238 | " |
| 7. | లోకనీతులు | 345–389 | 239–271 | " |
| | కావ్యసూచిక | | 272–282 | |
| | పద్య సంఖ్యానుక్రమణిక | | 283–288 | |
| | దాసరి లక్ష్మణస్వామి పరిచయం | | 289–296 | |

# చమత్కార చాటు పద్యములు

**1. చ. సరసులు గానివారి యెడఁ జాలఁ గవిత్వ రసప్రసంగముల్**
**కఱచుట కంఠశోషణమె కాక రసజ్ఞత కల్గ నేర్చునే**
**స్మరశరజాల వేదనకుఁ జాలక భ్రాంతిని ఱాతిబొమ్మతో**
**మరఁగి రమింపఁగాఁ దివిరి మానవుఁ డేమి సుఖింపఁ గల్గెడిన్**

**అన్వయం**: సరసులు – కాని – వారి + ఎడన్ – చాలన్ – కవిత్వ – రస – ప్రసంగముల్ – కఱచుట – కంఠ – శోషణమె – కాక – రసజ్ఞత – కల్గ నేర్చునే. స్మర – శర – జాల – వేదనకున్ – చాలక – భ్రాంతిని – మానవుఁడు – ఱాతిబొమ్మతోన్ – మరఁగి – తివిరి – రమింపఁగాన్ – ఏమి – సుఖింపన్ – కల్గెడిన్.

**వ్యాఖ్య**: తాను విన్నవీ సేకరించినవీ గుదిగుచ్చి దాసరి లక్ష్మణస్వామిగారు చమత్కారచాటు పద్యాలకింద ఇక్కడ సంకలించి పెట్టారు. వీటిలో కొన్ని పాతవీ, మరికొన్ని సమకాలికమైనవీ. ఏవి ఏమైనా చమత్కార జనకత్వమే వీటి పరమప్రయోజనం కనుక కవికాలాదులూ వగైరా గొడవలు ఇక్కడ ప్రసక్తాలు కావు. కొన్ని పద్యాలు ఇప్పటికే కొందరు కవుల పేర్లపై ప్రాచుర్యంలో ఉన్నాయి. అటువంటివి ఆయా కవుల రచనలుగానూ, తక్కినవి అజ్ఞాతకర్తృకాలుగానూ భావించడమొక్కటే ఇక్కడ చేయవలసిన పని. సరసత్వం లేనివారి సాంగత్యం వ్యర్థం అని చెప్తోందీ చాటువు.

**వ్యాఖ్య**: సరసులు కాని వారి దగ్గర అమితంగా (చాలన్) కవితాత్మకంగా రసాత్మకంగా ప్రసంగించటం – కవిత్వాన్ని పఠించడం (కఱచుట) ఓ ఊదరగొట్టెయ్యడం వృథా. అది కేవలం కంఠశోషణమే. గొంతు తడారిపోవడం తప్ప ప్రయోజనం ఉండదు. దానివల్ల ఆ రసహీనులలో ఒకింత రసజ్ఞత – రసాస్వాదన ఏమైనా కొంచెం కలుగుతుందా అంటే కలగనే కలగదు (కల్గనేర్చునే). దీనికో దృష్టాంతం చూపుతున్నాడు కవి.

ఎవడైనా సరే ఒక మానవుడు మన్మథబాణసమూహం (స్మరశరజాల) బాధిస్తోందని – తాళలేక (చాలకన్) ఏం చెయ్యాలో పాలు పోక, ఒక రాతిబొమ్మను మరిగి దానితో సుఖం పొందవచ్చుననే భ్రమతో (భ్రాంతిని) పూనికతో (తివిరి) ఆ రాతిబొమ్మతో రమిస్తే

– దానివల్ల ఆ మానవుడు ఏం సుఖపడతాడు? ఎంతమాత్రమూ సుఖపడలేడు. సరసతలేని వారితో సరససల్లాపాలు రాతిబొమ్మతోచేసే శృంగారం లాంటిదని. రెండూ వ్యర్థాలే.

★★★

**2. మ. రసవాదంబులు పెక్కు నేర్చిన మహారాజేంద్రులన్ గెల్చినన్**
**బసగా మేరువు చుట్టునుం దిరిగినన్ బంగారు కొండెక్కినన్**
**అసహాయంబగు శూరతం గనినఁ దా నంభోధి లంఘించిన**
**న్నొసటన్ వ్రాసిన వ్రాలుకన్నఁ గలదా నూఱేండ్లు చింతించినన్**

**అన్వయం**: పెక్కు – రస – వాదంబులు – నేర్చినన్, మహా + రాజ + ఇంద్రులన్ – గెల్చినన్, మేరువు – చుట్టునున్ – పసగాన్ – తిరిగినన్, బంగారు – కొండన్ – ఎక్కినన్, అసహాయంబు + అగు – శూరతన్ – కనినన్, తాన్ – అంభోధిన్ – లంఘించినన్, నూఱేండ్లు – చింతించినన్ – నొసటన్ – వ్రాసిన – వ్రాలు కన్నన్ – కలదా!

**వ్యాఖ్య**: పాదరసాన్ని బంగారంగా మార్చే విద్యను రసవాదమంటారు. ఈ దినుసు విద్యలు ఎన్ని నేర్చుకున్నా, మహామహారాజులను యుద్ధాలలో గెల్చినా, మేరుపర్వతం చుట్టూ చేవతో (పసగాన్) తిరిగినా, ఆ బంగారు కొండను ఎక్కినా, ఎవరి సహాయమూ కోరనంతటి (అసహాయ) శూరత్వం సంపాదించినా (కనినన్), సముద్రాన్ని (అంభోధిన్) దాటినా, ఎక్కడ ఉన్నా ఏం చేసినా సరే – నొసటిపై రాసిన రాతకంటే ఎక్కువ లాభం ఉంటుందా! ఉండదు. ఎవడికి ఎంత రాసిపెడితే అంతేతప్ప, జీవితాంతమూ (నూఱేండ్లు) ఆలోచించినా సరే, రాసిపెట్టినదానికంటే ఎక్కువగానీ తక్కువగానీ ప్రాప్తించదు. భర్తృహరి సుభాషిత త్రిశతిలో – వనే రణే శత్రు జలాగ్ని మధ్యే..... అనే శ్లోకానికి ఇది ఒక ఛాయ.

★★★

**3. చ. నిరుపహతిస్థలంబు రమణీప్రియదూతిక తెచ్చి యిచ్చు క**
**ప్పురవిడె మాత్మకింపయిన భోజన ముయ్యెలమంచ మొప్పు త**
**ప్పరయు రసజ్ఞు లూహ తెలియం గల లేఖకపాఠకోత్తముల్**
**దొరికినఁ గాక యూరక కృతుల్ రచియింపు మటన్న శక్యమే!**

**అన్వయం**: నిర్ + ఉపహతి – స్థలంబున్, రమణీ – ప్రియ – దూతిక – తెచ్చి – ఇచ్చు – కప్పుర – విడెమున్, ఆత్మకున్ – ఇంపు + అయిన – భోజనమున్ – ఉయ్యెల – మంచమున్, ఒప్పున్ – తప్పున్ – అరయు – రసజ్ఞులున్, ఊహన్ – తెలియన్ – కల – లేఖక – పాఠక + ఉత్తముల్ – దొరికినన్ – కాక – ఊరక – కృతుల్ – రచియింపుము – అటన్న – శక్యమే.

**వ్యాఖ్య**: ఆంధ్రకవితాపితామహుడైన అల్లసాని పెద్దన చెప్పినట్లుగా ప్రాచుర్యంలో ఉన్న చాటువు ఇది. కవిత్వం రావాలంటే అందుకు కావ్యసామగ్రి ఉండాలి. ఆలంకారికంగా కావలసిన ముడిపదార్థాలు అటుంచితే ఐహికంగా భౌతికంగా కవిత్వానికి ఏం కావాలో చెప్తున్నాడు కవి.

ఉపహతి అంటే దెబ్బ, నాశం, అడ్డగింత, ఉపద్రవం, ఆపద అనే అర్థాలున్నాయి. ఇక్కడ మొట్టమొదట నిరుపహతిస్థలం కావాలంటున్నాడు పెద్దన. నిరుపహతిస్థలం అంటే ఏకాంతప్రదేశం అని. ఎవరూ వచ్చి భంగపరచని ఏకాంతస్థలం కావాలని. ఇది కవిత్వం చెప్పడానికి ప్రాథమికమైన అవసరం!

ఇల్లాలికి ఇష్టురాలైన చెలికత్తె (రమణీప్రియదూతిక) ప్రియమారగా తెచ్చి ఇచ్చే కర్పూర తాంబూలం (కప్పురవిడెము) ఉండాలి. మనసుకు నచ్చిన (ఆత్మకింపైన) భోజనమూ, భోజనం చేశాక కర్పూర తాంబూలం వేసుకొని విలాసంగా ఊగడానికొక ఉయ్యాలమంచం ఉండాలి. తాను చెప్పే కవిత్వంలో తప్పొప్పులు చూడగలిగే రసజ్ఞులూ, కవి ఊహను ముందుగానే తెలుసుకోగల వారూ అయిన ఉత్తమలేఖకులూ, ఉత్తమపాఠకులూ దొరకాలి. వీళ్ళందరూ దొరికినప్పుడే కానీ ఊరికే కృతులు రచించమంటే కుదురుతుందా (శక్యమే)? కుదరదు అంటున్నాడు పెద్దన.

★★★

**4.** ఆ.వె. **అల్లసాని వాని యల్లిక జిగిబిగి**
**ముక్కు తిమ్మనార్యు ముద్దు పలుకు**
**పాండురంగ విభుని పదగుంఫనంబును**
**కాకమాని రాయ నీకె తగుర!**

**అన్వయం**: అల్లసాని వాని – అల్లిక – జిగిబిగి, ముక్కు – తిమ్మనార్యు – ముద్దు పలుకు, పాండురంగ – విభుని – పదగుంఫనంబును – కాకమానిరాయ! నీకె – తగుర!

**వ్యాఖ్య**: కాకమాను/కాకుమాని మూర్తికవి అని ఒక కవి ఉన్నాడు. అతణ్ణి స్తుతించే పద్యం ఇది. ఓ కాకమానిరాయడా – అల్లసాని పెద్దన కవిత్వంలోని జిగిబిగి అల్లిక, ముక్కు తిమ్మన కవిత్వంలోని ముద్దుపలుకూ, తెనాలి రామకృష్ణుడి (పాండురంగవిభుఁడు) కవిత్వంలోని పదగుంఫనం అనే లక్షణాలు నీకే తగినవి. అవన్నీ నీ కవిత్వంలోనే ఉన్నాయని. కాకమానుకవిని తిడుతున్నట్లుగానూ ఒక సమన్వయం ఉంది.